సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని మాతా నిమిషాంబదేవి ఆలయంలో శ్రావణమాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకుని అమ్మవారిని లక్ష నామాలతో మహిళలతో కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించామని, గాజులు శుభప్రదమైనవన్నారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిస్తే శక్తి, శాంతి, సౌభాగ్యం కలుగుతుందన్నారు. ఆలయ ప్రధాన కార్యదర్శులు అశోక్ కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, నకాష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



అల్వాల్: అల్వాల్ ఐల్యాండ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై కంటి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక కాలనీవాసులు కంటి వైద్య పరీక్షలు చేసుకున్నారు. సుకుమార్, కమల్, మనోజ్ఞ, శ్రావణి, అమీర్, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నూతన కమిటీ ఎన్నిక



నియామకపత్రాలను అందజేసిన మునుగంటి రాంప్రదీప్

కుషాయిగూడ: బీజేపీ మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పూర్తిస్థాయి కమిటీని డివిజన్ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్ ఆదివారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా గోపు రాజేశ్వర్‌పటేల్, బాలరాజు, ఉపాధ్యక్షులుగా తోట పవన్ నాగసాయి కిరణ్, రఘునాథ్‌రెడ్డి, రవీందర్, హర్షగౌడ్, శ్రీనివాస్, కార్యదర్శులుగా విశాల్‌రెడ్డి, రాధిక, ఉమారాణి, గట్టు మహేష్, శ్రీనివాస్‌నాయక్, కోశాధికారిగా మురళీచారిలకు నియామకపత్రాలను అందజేశారు.

రక్తదాన శిబిరం



రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పెయింటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వార్డు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్ బండారు శ్రీవాణీవెంకట్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి తమ రక్తాన్ని దానం చేసి ప్రాణదానం చేసిన వారు దేవుళ్లతో సమానమన్నారు. పెయింటర్స్ అసోసియేషన్ కరోనా సమయంలో కూడా రక్తదాన చేయడం ప్రశంసనీయమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు బండారు విజయ్‌కుమార్, రాజు, ప్రవీణ్, శ్రీను, లక్ష్మయ్య, సాంబరాజులతో పాటు బీజేపీ నేత రేవు నరసింహ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నిరసన



ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెనకు ఇరువైపుల ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆయా గుంతల వద్ద స్థానికులు ఆదివారం నిరసన చేపట్టారు. రోడ్డుపై ఏర్పడిన అడుగులోతు గుంతల్లో వాహనదారులకు గాయాలవుతున్నాయని, వాహనాలు దెబ్బతింటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. కాంట్రాక్టర్, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రమేష్‌గౌడ్, వెంకటేష్‌గుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, ప్రేమ్‌కుమార్, ఖలీల్, రాములు ముదిరాజ్ పాల్గొన్నారు.

మండల డీవైఎఫ్ఐ నూతన కమిటీ

మేడ్చల్: మండల డీవైఎఫ్ఐ నూతన కమిటీని మేడ్చల్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంజిత్ రెడ్డి, కార్యదర్శిగా బాలకిరణ్‌లను ఆదివారం ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా నర్సింహ్మా, మహేందర్, ప్రశాంత్, లోకేష్, కమిటీసభ్యులుగా వినయ్, బాబు, సోహెల్, సాయిచరణ్, సాయినాథ్, సద్దాం, సాయి, ప్రవీణ్‌లతో పాటు మరో 14 మందితో కమిటీని ఏర్పాటు చేశారు.



నిండు కుండలా చింతల చెరువు !

వర్షం పడినప్పుడల్లా ముంపునకు గురౌతున్న కాలనీలు

- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న స్థానికులు
- నగానికి కుచించుకుపోయిన చెరువు విస్తీర్ణం



చెరువు పరిధిలో వెలిసిన నిర్మాణాలు

బోడుప్పల్: గత 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెంగిచర్లలోని చింతల చెరువు నిండి, నిండు కుండను తలపిస్తోంది. ఎగువ కాలనీల నుంచి వచ్చే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగు, వరదనీరు చెరువులో చేరుతోంది. ఇక్కడకు చేరిన తర్వాత దిగువకు నీరు వెళ్లేందుకు అవుట్‌లెట్ లేదు. దీంతో నీరంతా అక్కడే నిల్వ ఉంటుంది. ఇదే చెరువును ఆనుకుని ఉన్న పలు కాలనీలు వర్షాలు పడినప్పుడల్లా ముంపునకు గురౌతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

43.33 ఎకరాల్లో విస్తీర్ణం..

చింతల చెరువు (చెరువు పరిధి, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌తో సహా) 43.33 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. కొంత భాగం చెరువు కబ్జాకు గురి కాగా.. ప్రస్తుతం 23.12 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. గడిచిన పదేళ్లల్లో చెరువుకు ఎగువ ప్రాంతంలో పలు కాలనీలు వెలిశాయి. వాటికి మౌలిక వసతుల్లో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టారు. సదరు కాలనీ నుంచి వచ్చే డ్రైనేజీ మురుగునీటితో పాటు వరదనీరు చెరువులో చేరుతోంది. అక్కడ నుంచి దిగవకు నీరు వెళ్లేందుకు అవుట్ లెట్ లేదు.

ముంపునకు గురయ్యే కాలనీలు

సాయినగర్, శ్రీనివాస్‌నగర్ ఫేస్ 1,2,3, సుశీల టౌన్‌షిప్, హిమగిరి కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. చెరువులో నీళ్లు డ్రైనేజీ పైపులైన్ ద్వారా కాలనీల్లోని ఇళ్లలోకి వస్తున్నాయి.

జీవనాధారం కోల్పోయిన మత్స్యకారులు

ఈ చెరువు మీద ఆధారపడి 60 ముదిరాజ్ కుటుంబాలు చేపలు పెంచుకుంటూ.. జీవనాధారం కొనసాగిస్తున్నాయి. చెరువులోకి మురుగు చేరడంతో జల కాలుష్యం ఏర్పడి చేపలు చనిపోతున్నాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి



ఎగువ కాలనీల నుంచి వచ్చే వర్షపు, డ్రైనేజీ మురుగు చెరువులోకి రాకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం చూపాలి. జల, వాయు కాలుష్యంతో నిత్యం నరకాన్ని చూస్తున్నాం. చెరువులో వ్యర్థాలు వేయడంతో అవి కుళ్లి భరించరాని వాసన వస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, సాయినగర్ కాలనీ

చెరువుకు ఎలాంటి ప్రమాదం లేదు



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెరువుకు ఎలాంటి ప్రమాదం లేదు. అనుకోకుండా భారీ వర్షాలు పడితే వాటి నివారణ కోసం అధికారులు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. ఎప్పటికప్పుడు వార్డు ఆఫీసర్లు కాలనీల్లో పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల హెచ్ఎండీఏ అధికారులు చెరువును పరిశీలించారు. త్వరలో అవుట్ లెట్ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

– శైలజ, కమిషనర్, బోడుప్పల్

ఇదే విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

నిలిచిన అవుట్‌లెట్ పనులు

చెంగిచర్లలోని చింతల చెరువు వద్ద ఎస్ఎన్‌డీపీ నిధులు రూ.110 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఫ్లడ్ వాటర్ క్లోస్డ్ ఛానెల్, మురుగు కాల్వల నిర్మాణం కోసం 2022 ఫిబ్రవరి 2న అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. చివరికి పనులు నిలిచిపోయాయి.

◆ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇటీవల హెచ్ఎండీఏ అధికారులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, మాజీ మేయర్ అజయ్ యాదవ్ కలిసి చెరువును పరిశీలించారు. త్వరలో అవుట్‌లెట్ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వారు వెల్లడించారు.

మేడ్చల్ జిల్లా కోర్టులో బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

కుషాయిగూడ: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనం సమర్పించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ ఉత్సవాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, స్థానిక నేతలు సంపత్, కనకయ్య, యాదగిరి తదితరులున్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



రిక్రియేషన్, లైబ్రరీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రజిత, ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తదితరులు

ఉప్పల్: డివిజన్‌లో సౌత్ స్వరూప్‌నగర్ కాలనీలో నిర్వహించిన సీసీ కెమెరాలను ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు అండగా సీసీకెమెరాలు పనిచేస్తాయని తెలిపారు. నేర నియంత్రణలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. అనంతరం కాలనీలో రిక్రియేషన్, లైబ్రరీని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ ఎస్సై చిరంజీవి, కాలనీ అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, రమణయ్య, శ్రీను, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, కార్మికులకు న్యాయం చేయాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్లు, కార్మికులు

మల్కాజిగిరి: సర్కిల్ పరిధిలో సేకరించిన వ్యర్థాలను తీసుకెళ్లే వాహన డ్రైవర్లు, కార్మికులకు తగిన న్యాయం చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులను కోరారు. ఆదివారం సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న 18 మంది డ్రైవర్లు, కార్మికులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్నవి పాత వాహనాలని, వాటికి డిజిల్ ఇవ్వకుండా నిలిపేశారన్నారు. కొత్త వాహనాలు ఇవ్వకుండా రాంకీకి అప్పజెప్పాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ జీహెచ్ఎంసీ సీటీఓ, జోనల్ కమిషనర్‌తో మాట్లాడానని, సమస్య పరిష్కారమయ్యేంత వరకు పాత వాహనాలను అనుమతించడంతో పాటు డిజిల్ ఇవ్వాలని అధికారులను కోరామన్నారు. త్వరలో కొత్త వాహనాలను అందజేస్తామన్నారు. ఆకుల శ్రీనివాస్, అజారుద్దీన్, బాలకృష్ణ, సంజీవ, బాబూరావు, సంజు, కార్మికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలను సాకారం చేద్దాం



నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

బోడుప్పల్: అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేద్దామని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. ఆదివారం బోడుప్పల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి 339వ జ్ఞానమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకులు, ప్రభుత్వాలు పారదర్శకంగా జవాబుదారితనంగా పని చేయాలని సూచించారు. బడుగు, బలహీనవర్గాలు చదువుకుని ఉన్నత స్థితిలో ఉండేందుకు కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ ఆశలను ప్రజల్లోకి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, యాకయ్య, సతీష్, మహంకాళి తదితరులున్నారు.

పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో గణేష్ ఉత్సవాలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి

మేడిపల్లి: గణపతి నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ఆధ్వర్యంలో గణేష్ మండప నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఆదివారం ఈ సమావేశానికి మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండప నిర్వాహకులు, కమిటీ నిర్వాహకులు, వివిధ కాలనీల ప్రెసిడెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. మండప నిర్వాహకులు శాంతియుతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ప్రజలు, పౌరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నవరాత్రి బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కాలనీల్లోని మండపాల వద్ద అల్లరిమూకలపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. వివిధ కాలనీల ప్రెసిడెంట్లు, మండపాల నిర్వాహకులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు లోబడి ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. సంక్షేమసంఘాల ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, రాఘవరెడ్డి, చక్రపాణిగౌడ్, యాపపురం రవి, గంప కృష్ణ, నర్సింహ్మారెడ్డి, గడ్డల పాండు, వాలియనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగాసన పోటీలు



యోగాసన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉప్పల్: అన్నపూర్ణ కాలనీ జోషి విద్యానికేతన్‌లో రంగారెడ్డి జిల్లా స్థాయి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి చైర్మన్ జగదీష్ జోషి ముఖ్యఅతిథిగా హాజరై యోగాను వీక్షించారు. భారతీయ సంస్కృతిని ప్రోత్సహించడానికి జిల్లా స్థాయి యోగాసన క్రీడా పోటీలను నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. యోగా ఇప్పుడు జాతీయస్థాయి క్రీడల్లో భాగమైందన్నారు. యోగాను స్పోర్ట్స్ కోటాలో కేంద్రప్రభుత్వ సంస్థల్లో సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపికైన వారు సెప్టెంబర్‌లో నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో పాల్గొంటారన్నారు. యోగాసన హైదరాబాద్ జనరల్ సెక్రటరీ జయరాజ్ ఆర్యన్, మేడ్చల్ జిల్లా సెక్రటరీ సూర్యప్రకాష్, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాలొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కుషాయిగూడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన ఆదర్శ్ (20) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ప్రైవేటు కొరియర్‌లో ఉద్యోగం చేసుకుంటూ నాగారంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి స్కూటీపై చర్లపల్లి వెళ్లి పనిచూసుకుని తిరిగివస్తుండగా.. ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో భద్రపరిచినట్లు ఎస్సై శేఖర్ చెప్పారు. కాగా కుటుంబసభ్యులెవరూ రాకపోవడంతో కేసు నమోదు చేయలేదని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మల్లాపూర్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నాచారం ఇన్‌స్పెక్టర్ రుదివీర్ అన్నారు. ఆదివారం మల్లాపూర్ భవానీనగర్ కాలనీలో సైబర్ నేరాలపై, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై చాలా మంది మోసపోతున్నారని, వాటిపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఎస్సై వెంకటయ్య, అరుణ్‌యాదవ్ పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య దీక్షాలయ గురువు లక్ష్మీశంకర్ సొది నుంచి ఆన్‌లైన్‌లో నేర్చుకున్న శిష్యబృందం ఉప్పల్‌లో నిర్వహించిన కూచిపూడి ప్రదర్శనలో పాల్గొని మెప్పించారు. వినాయకకౌతం, గీతరసికె, జతిస్వరం, సతులలా, రామాయణ శబ్దం తదితర అంశాలను గాయత్రి, శ్రీవాణి, వెంకట్ దీక్షితులు తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



కౌకూర్‌లో పర్యటిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్‌లోని లోతట్టు ప్రాంతాలైన ప్రశాంతినగర్ కాలనీ, విల్లా ఆర్చిడ్స్ కాలనీ, జనప్రియ ఆర్కేడియా కాలనీలు వరదనీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు కాలనీల్లో వరదనీటి నిల్వ సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారంపై చర్చించారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు తుడిమెళ్ల మల్లికార్జున్, డీఈ రఘు, హైడ్రా అధికారి మునిరత్నం, రిటైర్డ్ కర్నల్ ప్రశాంత్, వెంకట్, తివారీ, బాలనర్సింహ, రామకృష్ణ, సుధాకర్, లక్ష్మణ్, చౌబెయ్, సుఖీదర్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక

కుషాయిగూడ: బస్తీ దవాఖానాలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శైలజ ఉత్తమ డాక్టర్ అవార్డును అందుకున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆమెకు జిల్లా కలెక్టర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చక్రపాణి, ప్రతినిధులు వెంకటేశ్వర్లు, యాదయ్య, చల్లా వెంకటేష్, దయానంద్, జనార్ధన్, గోపినాథ్, రాజుముదిరాజ్, దూసరి శంకర్, శ్రీనివాస్ తదితరులున్నారు.





తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో తీజ్ పండగ



సాయి ఐశ్వర్య కాలనీలో తీజ్ వేడుకలు

బోడుప్పల్: 21వ డివిజన్ పరిధిలోని బాలాజీ హిల్స్ కాలనీలో తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బంజారా యువతులు తీజ్ పండుగ ఉత్సవాలను నిర్వహించుకున్నారు. నానబెట్టిన గోధుమలను మండపం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ భూక్యాసుమన్‌నాయక్ మాట్లాడుతూ.. 9 రోజుల పాటు పవిత్రంగా పూజించే తీజ్ పండుగను బంజార కుటుంబసభ్యులు ఎంతో వైభవంగా నిర్వహిస్తారన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సీత్లాభవానీకి ప్రత్యేక పూజలు

మేడిపల్లి: తరతరాలుగా బంజారా మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే తీజ్ పండుగ ఉత్సవాలు పీర్జాదిగూడ నగర పాలక సంస్థ సాయి ఐశ్వర్యకాలనీ రోడ్డునెంబర్–6లో తీజ్ వేడుకలు 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బుట్టలో మొలకెత్తిన నారును మహిళలు సాంప్రదాయబద్ధంగా పూజలతో సేవాలాల్ మహరాజ్, మేరామాయాడి సన్నిధిని ఏర్పాటు చేసుకుని నిష్ఠతో సీత్లాభవానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఆచారం ప్రకారం పూజలు చేశారు. ఊరేగింపులో మహిళలు లయబద్ధంగా చేసిన బంజార సాంస్కృతిక నృత్యాలు, ఆటపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. డాక్టర్ నెహ్రూనాయక్, రవినాయక్, ఓంసింగ్ నాయక్, లూనవత్ రాములునాయక్, శ్రీనివాస్‌నాయక్, మల్లూనాయక్, హరిలాల్‌నాయక్, ఆనంద్ నాయక్, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.